## క్లుప్తంగా

### కాంగ్రెస్ హయాంలో మహిళలకు రక్షణ కరువు



**ఆత్మకూరు :** కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువయ్యిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోజురోజుకు మహిళలపై దౌర్జన్యాలు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లాలో యువకుడి వేధింపులు తాళలేక ఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడితే ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. కారకులను ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. మహిళా వైద్యులకు కళాశాలల్లో, ఆస్పత్రుల్లో ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ మండల ప్రధానకార్యదర్శి బయ్య పైడి ఆచార్య, నాయకుడు బయ్య మాలగాం పాల్గొన్నారు.

### ఏఈఓకు సన్మానం



**వేలేరు :** మండలంలోని పీచర క్లస్టర్ ఏఈఓగా విధులు నిర్వర్తించిన జె.బాబు బదిలీపై వెళ్తున్న సందర్భంగా క్లస్టర్ పరిధిలోని రైతులు బుధవారం ఘనంగా సన్మానించారు. పదేళ్లపాటు అందించిన సేవలను మరువలేమని రైతులు కొనియాడారు.

### బాధ్యతల స్వీకరణ

**వర్ధన్నపేట :** వర్ధన్నపేట సీఐగా కొమ్ముూరి శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న సీఐ సూర్యప్రకాశ్‌ను హైదరాబాద్‌లోని ఐజీ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

### నియామకం

**పర్వతగిరి :** బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు నియామకమయ్యారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇంటి ఆవరణలో బుధవారం బీఆర్‌ఎస్ కార్యకర్తలు సమావేశం ఏర్పాటు చేసి, రాజేశ్వర్‌రావును బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గోనె సంపత్, బూర శ్యామ్, దర్శోజు దేవేందర్, ఏర్పుల శ్రీనివాస్, చింతల శ్రీనివాస్, ఎస్‌కె.షబ్బీర్‌అలీ, యాకయ్య, పరమేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**చెన్నారావుపేట :** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు ఓం ప్రకాష్ ఆచారి, ఎస్సై గూడ అరుణ్, మాజీ సర్పంచ్ కుండె మల్లయ్య, మాజీ జెడ్పీటీసీ జున్నూతుల రాంరెడ్డి, మాజీ ఎంపీపీ జక్క అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారి దివ్య ఆశీస్సులుతో ఈ నెల 26 నుంచి వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. జల్లిలో 29వ తేదీ వరకు, ఎల్లాయగూడెంలో సెప్టెంబర్ 2వ తేదీ వరకు వేడుకలు జరుగుతాయన్నారు.

### భారత్ బంద్ విజయవంతం

**నర్సంపేట :** ఎస్సీ ఉప వర్గీకరణ చేసుకునే వెసులుబాటును రాష్ట్రాలకు కల్పిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ కోర్టు నిర్ణయాల్లో రాజకీయ జోక్యాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం దేశవ్యాప్తంగా దళిత సంఘాలు చేపట్టిన భారత్‌బంద్‌లో భాగంగా నర్సంపేట పట్టణంలో దళిత సంఘాల నాయకులు విద్యా సంస్థలు బంద్ చేయించారు. జాతీయ మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల రవి మాట్లాడుతూ రాజ్యాంగ సవరణ జరుగకుండా వర్గీకరణ ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు.

### టీ షర్ట్స్ పంపిణీ

**నర్సంపేట రూరల్ :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జేడీ ఫౌండేషన్ కన్వీనర్ పింగిలి కవిత రెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని మాధన్నపేట జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు రామచంద్రు అధ్యక్షతన కవితరెడ్డి, గణిత ఉపాధ్యాయురాలు సుధావాణిలు ఉచితంగా టీ షర్ట్స్ పంపిణీ చేశారు. కృష్ణమూర్తి, మహేందర్‌రెడ్డి, చంద్రమౌళి జేడీ ఫౌండేషన్ సేవలను కొనియాడారు.

### విద్యార్థుల అభివృద్ధికి కృషి

**ఖానాపురం :** విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని హెచ్‌ఎం రమేష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని బాలుతండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సంపూర్ణ బదిలీ కాగా బుధవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

# భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు

- డప్పుచప్పుళ్ల నడుమ ఆలయాలకు బయల్దేరిన భక్తులు
- చీర,సారె సమర్పించిన మహిళలు



శాయంపేట : డప్పుచప్పుళ్ల నడుమ బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

**ఆత్మకూరు / శాయంపేట / హన్మకొండ(పరకాల) దామెర / నడికూడ / వేలేరు / :** శ్రావణమాస బుధవారం సదర్భంగా దామెర మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పోచమ్మ బోనాల సందడి నెలకొంది. బెల్లంతో తయారుచేసిన బోనాన్ని మహిళలు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సినీగేయ రచయిత, సంగీత దర్శకుడు వరంగల్ శ్రీనివాస్, తన కుమారుడు బొడ్డు విశ్వతేజతో కలిసి అమ్మ వారిని దర్శించుకున్నారు. వారి వెంట మాజీ సర్పంచ్ శ్రీరాంరెడ్డి, రాజు, మహేశ్ ఉన్నారు. అలాగే కోగిల్వాయిలో సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే నడికూడ మండలంలోని కాకొండతో పాటు పలు గ్రామాల్లో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించుకున్నారు. అదే విధంగా వేలేరు మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను ఘనంగా వేడుక ఘనంగా జరిగింది. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మాజీ జెడ్పీటీసీ సరిత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఇట్టబోయిన సంపత్ పాల్గొన్నారు. అదే విధంగా ఆత్మకూరు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బుధవారం పోచమ్మతల్లి బోనాలు ఘనంగా జరిగాయి. మహిళలు బోనాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. పోచమ్మతల్లికి చీర, సారె, సాక, బోనం సమర్పించుకున్నారు. అలాగే శాయంపేట మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో కురుమ కులస్థులు పోచమ్మ బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, వాయిద్యాల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకుని బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. గొర్రెలు, మేకలు, కోళ్లను నైవేద్యంగా సమర్పించి సల్లంగా చూడు తల్లి అంటూ వేడుకున్నారు. అదే విధంగా పరకాల పట్టణంలో పోచమ్మతల్లి బోనాల వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వాడవాడ నుంచి బోనాలతో బయలుదేరి డప్పుచప్పుళ్ల నడుమ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు. దీంతో భూపాలపల్లి రోడ్డులోని పోచమ్మతల్లి ఆలయం వద్ద భక్తుల కోలాహలం నెలకొంది.



ఆత్మకూరు : మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



వేలేరులో..

# ఏకకాలంలో రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌దే

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజు



ముల్కనూరులో మాట్లాడుతున్న రాజు

**ఎల్కతుర్తి :** పార్టీలకు అతీతంగా రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కొలుగూరి రాజు అన్నారు. బుధవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడుతగా లక్ష రుణమాఫీ, రెండో విడుతలో లక్షన్నర, మూడో విడుతలో రూ.2లక్షల రుణమాఫీ చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని, ఆ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు మాత్రమే ప్రభుత్వ ఫలాలు అందాయని ఆరోపించారు. కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ మాత్రం ఇచ్చిన హామీకి కట్టుబడి ఏకకాలంలో రుణమాఫీ చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్న సందర్భంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతీ కార్యకర్త రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను తెలుపాలని సూచించారు. ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను సైతం తెలపాలని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేసిన ఘనతను వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్, మీస మహేశ్, మాచర్ల శ్రావణ్, సంపత్, తకిల్‌పాషా, ప్రకాశ్, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

## అటెన్షన్ ప్లీజ్



### ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా?

**ఆత్మకూరు :** మండల కేంద్రంలోని గొల్లవాడ ప్రాథమిక పాఠశాల సమీపంలో నూతనంగా సీసీ రోడ్డు నిర్మించారు. కానీ విద్యుత్ స్తంభాన్ని మధ్యలోనే వదిలేశారు. దీంతో ప్రమాదకరంగా మారింది. రాత్రివేళ వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. స్తంభాన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
శ్రీనివాస్‌రెడ్డి, ప్రత్యేకాధికారి
ఫోన్‌నంబర్ : 9281479600

# మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- డీఆర్డీఓ నాగపద్మజ



దామెర : పాల ఉత్పత్తుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీఓ నాగపద్మజ

**దామెర :** మహిళలు స్వయం ఉపాధిని సద్వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని డీఆర్డీఓ నాగపద్మజ అన్నారు. మండల కేంద్రంలో ఇందిరా మహిళాశక్తి ద్వారా పాల ఉత్పత్తుల విక్రయ కేంద్రం ఏర్పాటు చేయగా బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామానికి చెందిన అల్లం కల్యాణికి 1,90,000 రుణం మంజూరు చేయగా పాల ఉత్పత్తుల కేంద్రం ఏర్పుచుకున్నట్లు తెలిపారు. ఇందిరా మహిళాశక్తి ద్వారా మంజూరు చేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. మహిళలు వ్యాపారాల్లో రాణించి లాభాలు పొందాలని ఆకాంక్షించారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని ఈ సందర్భంగా సూచించారు. ఆమె వెంట ఏపీఎం ఝాన్సీ, వీఓ శ్యామల, సీసీ మాధవి, అకౌంటెంట్ సుకొనె రాజేశ్వరితో పాటు తదితరులు ఉన్నారు.

# ఏడేళ్ల తర్వాత ఏఓ పోస్టు భర్తీ

- బాధ్యతలు స్వీకరించిన జైసింగ్



జైసింగ్

**నడికూడ :** నూతన మండలంగా ఏర్పాటు అయ్యి ఏడేళ్ల తరువాత మండల వ్యవసాయశాఖ అధికారి పోస్టుకు మోక్షం లభించింది. ఏఓగా పోరిక జైసింగ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అయితే ఏడు సంవత్సరాల నుంచి పరకాల ఏఓ శ్రీనివాస్ విధులు నిర్వహించారు. ఇటీవల మండలానికి ఏఓ పోస్టు మంజూరు కావడంతో ములుగు జిల్లా నుంచి బదిలీపై వచ్చిన పోరిక జైసింగ్ బాధ్యతలు స్వీకరించగా రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వ్యవసాయానికి సంబంధించిన పనులు, సూచనలకు పరకాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఏఓను నియమించినందుకు అధికారులకు, ప్రభుత్వానికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు



డప్పుచప్పుళ్లు, బోనంతో వస్తున్న మహిళలు

**దామెర :** మండల కేంద్రంలో పోచమ్మ ఆలయ పునర్నిమానంలో భాగంగా బుధవారం అమ్మవారి విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రధాన ఆసం లింగమూర్తిచార్యులు, సుదర్శనాచారి, రవీంద్రచారి, అనిల్‌శాస్త్రీ, సుధాకరాచారి, శ్రీధరాచారి వేద మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం యంత్ర ప్రతిష్ఠ, ప్రతిష్ఠ దైవబలం, కళన్యాస హోమం, దృష్టి స్థాపనం, మహా నైవేద్యం, మంత్రపుష్పం, మహాదాశీర్వచనం, తీర్థప్రసాదగోష్ఠి, శాంతిమంత్ర పఠన వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం డప్పుచప్పుళ్లు, మంగళహారతులతో మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. టెంకాయలు, పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు, ధూపదీపం, జంతుబలి నిర్వహించి తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. శివం ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీరాంరెడ్డి, అడ్వకేట్లు అనిల్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, భిక్షపతి, కుమారస్వామి, రమేష్, సునీల్‌కుమార్, రాజు, ఆలయ కమిటీ సభ్యులు భద్రయ్య, రాజేందర్, శ్యామ్, అశోక్, భిక్షపతి, శంకర్ పాల్గొన్నారు.

# బీజేవైఎం కార్యవర్గసభ్యుడిగా రవికిరణ్



రవికిరణ్

**శాయంపేట :** మండలంలోని తహరాపూర్ గ్రామానికి చెందిన తాటికొండ రవికిరణ్‌ను బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు సేవెల్ల దేవేందర్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవేళ్ల మహేందర్, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిసత్యపాల్‌రెడ్డి, గజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# వెంటాడిన అనారోగ్యం.. ఇద్దరి ఆత్మహత్య

**ఎల్కతుర్తి :** కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 19వ తేదీన గడ్డిమందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొదుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గోరంటల కొమాల్‌రెడ్డి (51) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రుల్లో వైద్యం తీసుకున్నా ఫలితం లేదు. దీంతో అనారోగ్య బాధ భరించలేక సోమవారం గడ్డిమందు తాగి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో వెంటనే వారు చికిత్స నిమిత్తం 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కొమాల్‌రెడ్డి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

**చికిత్స పొందుతూ వృద్ధురాలు..**

నరాల వ్యాధితో బాధపడుతున్న వృద్ధురాలు గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ సంఘటన భీమదేవరపల్లి మండలం ముస్తాఫాపూర్‌లో బుధవారం చోటుచేకుంది. ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాఫాపూర్ గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి ప్రమీల (78) నరాల వ్యాధితో కొంతకాలంగా బాధపడుతోంది. మెదడులోని నాడి కణాలు బలహీనపడడంతో మనోవేదనకు లోనైన ఆమె.. ఈనెల 17వ తేదీన గడ్డిమందు తాగింది. చికిత్స నిమిత్తం ముల్కనూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ‘అమ్మ’ పేరుతో మొక్క నాటాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గుండె బాబు

**కమలాపూర్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిఒక్కరూ వారి అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని ఎంపీడీఓ గుండె బాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం వివిధ అభివృద్ధి పనులపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మ పేరుతో మొక్క నాటించే కార్యక్రమాన్ని అధికారికంగా చేపట్టాలని అధికారులను కోరారు. పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా అన్ని శాఖల గ్రామ స్థాయి అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, రాజకీయ నాయకులు, ప్రజలందరిని భాగస్వామ్యం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో ఇంకుడుగుంత నిర్మించుకునేలా చూడాలని, రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యం, పన్నుల వసూలు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎంపీఓ రవి, ఈజీఎస్ ఏపీఓ రమేశ్, ఈసీ కార్తీక్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

**దామెరలో..**

**దామెర :** ప్లాంట్ ఫర్ మదర్ (నాటుదాం ఒక చెట్టు – అమ్మపేరుతో) కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఏపీఓ శారద పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేడు(గురువారం) వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. గ్రామాల వారీగా నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు. నర్సరీల్లో ఉన్న మొక్కలను పంపిణీ చేసి నాటే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో టీఏలు సురేందర్, ప్రిసిల్లా, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- బీజేపీ నాయకుల ధర్నా, రాస్తారోకో



ధర్నా, రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

**కమలాపూర్ :** ఆంక్షలు లేకుండా అర్హులైన రైతులందరికీ వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద హుజూరాబాద్–పరకాల ప్రధాన రహదారిపై బైఠాయించి బుధవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ చేయలేదని, వెంటనే వందశాతం రైతు రుణమాఫీ చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయని పక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. బీజేపీ శ్రేణుల ధర్నా, రాస్తారోకోతో హుజూరాబాద్–పరకాల ప్రధాన రహదారికిరువైపులా వాహనాలు పెద్దఎత్తున నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కిసాన్ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి కోటేశ్వర్, మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ మాటం రమేశ్‌బాబు, నాయకులు భూపతి ప్రవీణ్, బండారి సుధాకర్, చెరిపెల్లి రతన్‌కుమార్, బైరి రాజేశ్, రాంబాబు, కుమారస్వామి, మేడిపెల్లి రాజు, సుందరయ్య, బ్రహ్మాచారి, సదానందం, ఓదెలు, ఐలయ్య, పవన్‌కుమార్, రాకేశ్, అశోక్ పాల్గొన్నారు.

# విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ ప్రహసిత్

**ధర్మసాగర్ :** విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకుని నిత్యసాధన చేసి ఛేదించాలని ప్రముఖ మానసిక వైద్యుడు ప్రహసిత్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరాశ, నైరాశ్యం, నిర్వేదం వంటి రుగ్మతలను దరిచేరనివ్వకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని సూచించారు. మాదకద్రవ్యాలు, వ్యసనాల వలన నేర ప్రవృత్తి, మానసిక, శారీరకంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. నైపుణ్యాల్లో, చదువులో వెనుకబడడం వంటి అంశాలు ఆత్మహత్య చేసుకునే ఆలోచనకు దారితీస్తాయని తెలిపారు. ఎలాంటి సమస్య వచ్చినా కృంగిపోకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లి సమస్యను అధిగమించాలని సూచించారు. చదువుపై ఏకాగ్రత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్, మండల వైద్యాధికారి గోపీనాథ్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి మంజుల, అధ్యాపకులు వెంకట్, రాములు, అజం, రాజేందర్, సదానందం, ప్రభాకర్,గణేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



కమలాపూర్ : అభినందిస్తున్న రాజమల్లయ్య



ఆత్మకూరు : మాట్లాడుతున్న రాజేందర్

**కమలాపూర్ :** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కమలాపూర్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మీస రాజమల్లయ్య కోరారు. ఎఫ్‌ఎల్‌ఎన్ మానిటరింగ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన నేరెళ్ల ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సబియామదహత్ తన కుమారుడు ఎండీ.ఇషాన్‌అహ్మద్‌ను అదే పాఠశాలలో మూడోతరగతిలో చేర్పించగా... ఆయన అభినందించారు. కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి హెచ్‌ఎం సబియామదహత్ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందనే భరోసాను విద్యార్థుల తల్లిదండ్రులకు ఇచ్చారని అన్నారు. దీంతో ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆయన ఆశాభావ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్పీ పీడబ్ల్యూసీ పవన్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరులో..**

**ఆత్మకూరు :** విద్యార్థులు ఇష్టపడి చదవాలని మండల ప్రత్యేక అధికారి రాజేందర్ అన్నారు. తిరుమలగిరిలోని కేజీబీవీ పాఠశాల, కళాశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాల మౌలిక వసతుల కల్పనకు తోడ్పడతామన్నారు. ఉపాధ్యాయులు శ్రద్ధగా తరగతులు బోధించాలని, విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ వాసవి పాల్గొన్నారు.

# నేడు బీఆర్‌ఎస్ ఆందోళన

**శాయంపేట :** రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ ఆంక్షలు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి, కొంత మంది రైతులకు మాత్రమే చేయడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ఆందోళన చేపట్టనున్నట్లు మాజీ ఎంపీపీ తిరుపతిరెడ్డి ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

# అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం



ఎంపీడీఓ ఆంజనేయులును సన్మానిస్తున్న ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు

**హన్మకొండ (పరకాల) :** ఉత్తమ ఉద్యోగ అవార్డు అందుకున్న పరకాల ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులుతో పాటు కార్యాలయ సూపరింటెండెంట్ శైలశ్రీని కార్యాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ ఆఫీసర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు శాలువాలతో ఘనంగా సన్మానించారు. పరకాల ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టి 6 నెలల కాలంలోనే ఉత్తమ ఉద్యోగ అవార్డును అందుకోవడం ఆనందంగా ఉందని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఇందిర తదితరులు పాల్గొన్నారు.